సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 10+8 వెల: ₹ 5.50
సంపుటి: 17
సంచిక: 195
శనివారం 5-10-2024
SIMULTANEOUSLY PRINTED AT NIZAMABAD | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదు. పేదింట్లో పుట్టిన ప్రతి ప్రతిభావంతుడు ఉన్నత చదువులు చదవాలి.'


అర్హులకు 'డబుల్' ఇళ్లు
❖ పనిచేసేవారికే పదవులు
❖ ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు - 2లో..


దుర్గమ్మకు పూజలు
జిల్లాలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. - 5లో..

న్యూస్‌రీల్

సోయా పంట మొత్తం కొనుగోలు చేయాలి

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : సోయా పంట కొనుగోలులో సీలింగ్ పద్ధతి ఎత్తివేసి, పండించిన పంటను పూర్తిగా కొనుగోలు చేయాలని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ విషయమై ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎకరానికి 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని, ప్రభుత్వం ఆరు క్వింటాళ్లే కొంటామనడం సరికాదని పేర్కొన్నారు. కామారెడ్డి జిల్లాలో 90 వేల ఎకరాల్లో సోయా పంట సాగైందని, రైతులు పండించిన పంటను పూర్తిగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సోయా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మొత్తం పంటను కొనుగోలు చేయాలని కోరారు. సోయాలకు క్వింటాలుకు ఎంఎస్పీపైన రూ. 500 బోనస్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కొనసాగుతున్న సర్టిఫికెట్ వెరిఫికేషన్



కామారెడ్డి టౌన్: డీఎస్సీ -2024కు ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన కొనసాగుతోంది. డీఈవో కార్యాలయంలో ఇప్పటివరకు 903 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు. ఇంకా 313 మంది ధ్రువీకరణ పత్రాలను పరిశీలించాల్సి ఉంది.

నేటితో ముగియనున్న గడువు

డీఎస్సీ–2024కు ఎంపికైన వారి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ ఈనెల 2వ తేదీన ప్రారంభమైంది. డీఈవో కార్యాలయంలో 10 ప్రత్యేక కౌంటర్ల ద్వారా పరిశీలన కొనసాగుతోంది. ఈ ప్రక్రియ శనివారంతో ముగియనుంది. గడువులోపు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరు కావాలని డీఈవో రాజు అభ్యర్థులకు సూచించారు.

డీఎల్‌వీఎంసీకి దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: జిల్లాస్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ (డీఎల్ వీఎంసీ) ఏర్పాటుకు ఐదుగురు అనధికార సభ్యుల ఎంపిక కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ విషయమై జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి జి.రజిత ఒక ప్రకటన విడుదల చేశారు. కనీసం డిగ్రీ చదవి, ఎలాంటి పోలీసు ఎఫ్ఐఆర్ నమోదు కాని ఎస్సీ, ఎస్టీ వ్యక్తులు ఇద్దరు, ఎన్జీవో సంస్థల అనుబంధం ఉన్న ముగ్గురిని సభ్యులుగా ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు కలెక్టరేట్‌లోని 113 నంబర్ గదిలో గల తమ కార్యాలయంలో దరఖాస్తులు అందించాలని సూచించారు.

సదరం శిబిరాల తేదీలు ఖరారు

కామారెడ్డి టౌన్: సదరం శిబిరాల తేదీలను ఖరారు చేసినట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 9, 23 తేదీలలో జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శిబిరాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఎముకలు, కంటి, ఈఎన్‌టీ, మానసిక దివ్యాంగులు శిబిరంలో పాల్గొని నిర్ధారణ పరీక్షలు చేయించుకుని సర్టిఫికెట్లు పొందాలని సూచించారు. అర్హులైనవారు ఈనెల 5వ తేది నుంచి స్థానిక మీ సేవ కేంద్రాలలో స్లాట్ బుక్ చేసుకోవాలని పేర్కొన్నారు. మెడికల్ రిపోర్టులు, వికలాంగత్వం ఉన్న పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఆధార్ కార్డులతో శిబిరానికి రావాలని సూచించారు.

దోమకొండ 100 పడకల ఆస్పత్రికి ఆర్థిక శాఖ ఆమోదం!

కామారెడ్డి టౌన్: దోమకొండ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను 100 పడకల ఆస్పత్రిగా మార్చడానికి ఆర్థిక శాఖ శుక్రవారం ఆమోదం తెలిపింది. ఈ విషయాన్ని జిల్లా వైద్యాధికారులు తెలిపారు. దోమకొండలో వంద పడకల ఆస్పత్రికి భవన నిర్మాణం కోసం రూ. 45.50 కోట్లతో తెలంగాణ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టీజీఎంఎస్ఐడీసీ) గతంలోనే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. ఇప్పటికే ఆస్పత్రి భవన నిర్మాణానికి ముత్యంపేట రోడ్‌లో 4 ఎకరాలకుపైగా భూమిని అప్పగిస్తూ గ్రామ పంచాయతీ, జిల్లా పరిషత్‌లలో తీర్మానం చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం జిల్లాకు వచ్చిన ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ వైద్య ఆరోగ్యశాఖ మంత్రితో ఫోన్‌లో మాట్లాడినట్లు తెలిసింది. మంత్రి ఆదేశాలతో ఆస్పత్రి స్థాయి పెంపునకు ఆర్థిక శాఖ ఆమోదం తెలిపిందని సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం తుది జీవోను విడుదల చేయాల్సి ఉంది.

మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వేదికపై ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ



రుణమాఫీపై ఆందోళన వద్దు

- అర్హులందరి రుణాలు మాఫీ చేస్తాం
- రుణమాఫీని పట్టించుకోని పార్టీలు విమర్శలు చేయడం సిగ్గుచేటు
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

భిక్కనూరు: అర్హులైన రైతులందరికీ రుణమాఫీ పథకాన్ని వర్తింపజేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. పంట రుణాలు మాఫీ కాని రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావద్దన్నారు. పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ సన్మాన సభలో పాల్గొనేందుకు శుక్రవారం నిజామాబాద్‌కు వెళ్తున్న తుమ్మల.. భిక్కనూరు టోల్‌ప్లాజా వద్ద ఆగి కాంగ్రెస్ శ్రేణులతో మాట్లాడారు. రైతుల సంక్షేమం గురించి పట్టించుకోని పార్టీలు రుణ మాఫీపై మాట్లాడడం సిగ్గుచేటన్నారు. కుటుంబ నిర్ధారణ ఆధారంగా రూ. 2 లక్షల పంట రుణాన్ని మాఫీ చేస్తామని పేర్కొన్నారు. అంతకన్నా ఎక్కువ రుణం ఉన్న రైతులు పై డబ్బులు చెల్లిస్తే మాఫీ వర్తిస్తుందన్నారు. రైతు భరోసా, రైతు బీమా అమలు చేయడంతోపాటు వ్యవసాయానికి సంబంధించిన అన్ని సబ్సిడీ పథకాలను పునరుద్ధరిస్తామన్నారు. రైతుల సంక్షేమం కోసం సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, మాజీ ఎమ్మెల్యే యూసుఫ్ అలీ, డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రకాంత్ రెడ్డి, కిసాన్ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు లింగారెడ్డి, నాయకులు బల్యాల సుదర్శన్, భీంరెడ్డి, అనంత్ రెడ్డి, జాంగారి గాలిరెడ్డి, తొగరి సుదర్శన్, లింబాద్రి, మైపాల్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, గంప కృష్ణ, కిష్టాగౌడ్, కృష్ణహరి, భూమయ్య, ధర్మయ్య, స్వామి, అంకం రాజు పాల్గొన్నారు.

కార్యకర్తలే పార్టీ బలం

- పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్

భిక్కనూరు: కాంగ్రెస్‌కు కార్యకర్తలే బలమని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా నిజామాబాద్ వెళ్తున్న ఆయనకు పార్టీ శ్రేణులు భిక్కనూరు టోల్ ప్లాజా వద్ద సన్మానించాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ''అధికారం వస్తది.. పోతది.. పార్టీ మాత్రం శాశ్వతంగా ఉంటది'' అన్నారు. కష్టపడ్డ వారికే పదవులు వస్తాయని, తాను ఎన్ఎస్‌యూఐ కార్యకర్తనుంచి పీసీసీ అధ్యక్షుడి వరకు ఎదిగానని పేర్కొన్నారు. ప్రధాని మోదీ ఆదానీ, అంబానీలకు దేశ సంపదను దోచి పెడుతున్నారని ఆరోపించారు. రాహుల్‌గాంధీ ప్రధాని అయితేనే దేశ భవిష్యత్తు బంగారుమయంగా మారుతుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 90 శాతం సీట్లు కాంగ్రెస్ గెలుచుకోవాలన్నారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేసేందుకు ప్రతి కార్యకర్త ఇప్పటి నుంచే శ్రమించాలన్నారు. పాలన పరంగా కేసీఆర్ నిజామాబాద్‌ను విభజించి రెండు జిల్లాలుగా ఏర్పాటు చేసినప్పటికీ తనకు నిజామాబాద్, కామారెడ్డి రెండూ సమానమేనన్నారు. కార్యక్రమంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, యూత్ విభాగం జిల్లా అధ్యక్షుడు ఇలియాస్ పాల్గొన్నారు.

రాజన్నా.. నీ ఆరోగ్య రహస్యమేంది?

''నలభై ఏళ్లుగా చూస్తున్నా ఆయనలో ఏ మార్పూ లేదు. 85 ఏళ్లు వచ్చినప్పటికీ బీపీ లేదు.. షుగర్ లేదు..'' అంటూ పీసీసీ డెలిగేట్, డీసీసీబీ మాజీ చైర్మన్ ఎడ్ల రాజిరెడ్డిని ఉద్దేశించి మహేశ్‌కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. ''రాజన్నా.. నీ ఆరోగ్య రహస్యమేంటి'' అని ప్రశ్నించారు. దీంతో సభాప్రాంగణమంతా నవ్వులు పూచాయి. రాహుల్‌గాంధీని ప్రధానమంత్రి చేయడానికి ఆయన ఈ వయసులోనూ శ్రమిస్తున్నారని, ఆయనను కార్యకర్తలు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.


మాట్లాడుతున్న పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, పక్కన ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

కాంగ్రెస్‌లో ప్రతి కార్యకర్తకు గుర్తింపు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: కాంగ్రెస్‌లో కార్యకర్తలకు ప్రాధాన్యత ఉంటుంది అనడానికి ప్రస్తుతం పీసీసీ అధ్యక్షుడిగా తనకు దక్కిన గుర్తింపే నిదర్శనమని బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. పీసీసీ అధ్యక్షుడిగా నియామకం అయిన తర్వాత ఆయన తొలిసారి జిల్లాకు రాగా నగరంలోని పాత కలెక్టరేట్ గ్రౌండ్‌లో సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ కార్యకర్తల పనితీరు, మద్దతుతోనే తనకు పదవి దక్కిందన్నారు. ఇది కార్యకర్తలకే దక్కినట్లన్నారు. తన 38 ఏళ్ల రాజకీయ జీవితంలో అనేక కష్టాలు, నష్టాలు చవిచూశానని, అన్నింటికీ పీసీసీ అధ్యక్ష పదవి రూపంలో కాంగ్రెస్ అధిష్టానం వడ్డీతో సహా ఫలితం ఇచ్చిందన్నారు. 1986లో తాను ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడిగా పదవీబాధ్యతలు చేపట్టినప్పుడు పీసీసీ అధ్యక్ష పదవి దక్కుతుందని కలలో కూడా ఊహించలేదన్నారు. పార్టీ కోసం పాటుపడిన ప్రతి కార్యకర్త జీవితంలో వెలుగులు నింపుతామన్నారు. మారుమూల నాగన్నచెరువు(రహత్‌నగర్)లో పుట్టిన తాను ఊహించని రీతిలో పీసీసీ అధ్యక్షుడినయ్యానన్నారు. కాంగ్రెస్ అధినాయకత్వంతోనే కష్టానికి గుర్తింపు దక్కిందన్నారు. తల్లిదండ్రుల పుణ్యం, సహకరించిన అందరికీ ధన్యవాదాలంటూ మహేశ్‌గౌడ్ భావోద్వేగానికి గురయ్యారు. కాగా రాహుల్‌గాంధీ ఆలోచనా విధానంతో ముందుకు వెళతామన్నారు. ఇందులో భాగంగానే సోషల్ ఇంజినీరింగ్, బీసీ గణన జరుగుతోందన్నారు. ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేసే పనిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందన్నారు. స్థానిక ఎన్నికల్లో కార్యకర్తలందరికీ న్యాయం చేస్తామన్నారు. పీసీసీ, జిల్లా కాంగ్రెస్ కమిటీల్లోనూ 60 శాతం పదవులు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల వారికే కేటాయించనున్నట్లు తెలిపారు. మహేశ్‌గౌడ్ అభినందన సభకు మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు హాజరయ్యారు. తండ్రి మరణంతో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, విదేశాల్లో ఉండడంతో భట్టి విక్రమార్క, సీతక్క, జూపల్లి కృష్ణారావు రాలేకపోయారు. మంత్రులు ఒక హెలీకాప్టర్‌లో వచ్చారు. మరో హెలీకాప్టర్‌లో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్, మహేశ్ గౌడ్ కుటుంబ సభ్యులు వచ్చారు.

హైవేపై పోలీస్ వాహనాన్ని అడ్డుపెట్టి..

- గంటన్నరపాటు ట్రాఫిక్ మళ్లింపు
- ఇబ్బందిపడ్డ వాహనదారులు


పోలీస్ వాహనాన్ని రోడ్డుకు అడ్డంగా పెట్టి ట్రాఫిక్ మళ్లిస్తున్న దృశ్యం

భిక్కనూరు: ప్రజలకు సేవలు అందించాల్సిన పోలీసులు.. వారినే ఇబ్బందిపెట్టేలా వ్యవహరించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వివరాలిలా ఉన్నాయి. పీసీసీ చీఫ్‌గా మహేశ్‌కుమార్‌గౌడ్ బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా శుక్రవారం ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు వచ్చారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో భిక్కనూరు టోల్ ప్లాజా వద్ద పీసీసీ అధ్యక్షుడికి స్వాగతం, సన్మానం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అయితే ఈ సందర్భంగా పోలీసులు అత్యుత్సాహాన్ని ప్రదర్శించి వాహనదారులను ఇబ్బందిపెట్టారు. జాతీయ రహదారిపై ఒకవైపు పోలీసు వాహనాన్ని అడ్డుపెట్టి, సుమారు గంటన్నర పాటు వన్‌వే చేశారు. అధికార పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వస్తున్నాడని పోలీసులు అత్యుత్సాహాన్ని ప్రదర్శించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అసలే పండుగల సీజన్.. ఆపై వన్‌వే చేయడంతో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ప్రజాపాలన అంటే ప్రజలను ఇబ్బందులు పెట్టడమేనా అని పలువురు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు.

పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేసులో పుల్గం!

- మద్దతు కూడగడుతున్న సంఘం నేతలు
- ఈనెల 7, 8 తేదీల్లో రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో ఎన్నికలు


పుల్గం దామోదర్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేసులో జిల్లాకు చెందిన పుల్గం దామోదర్‌రెడ్డి ఉన్నారు. యూనియన్‌లో క్రియాశీలకంగా పనిచేస్తున్న ఆయన తనకున్న పరిచయాలతో సభ్యుల మద్దతు కూడగట్టేందుకు యత్నిస్తున్నారు. ఈ నెల 7, 8 తేదీలలో హైదరాబాద్‌లో జరిగే పీఆర్టీయూ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నారు.

ఇటీవలి వరకు యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన నిజామాబాద్ జిల్లాకు చెందిన కమలాకర్‌రావు ఉద్యోగ విరమణ చేశారు. ఉమ్మడి జిల్లాకు మరోసారి ప్రధాన కార్యదర్శి పదవి కోసం యూనియన్ ప్రతినిధులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. కామారెడ్డి జిల్లాలో ఎక్కువ సంఖ్యలో సభ్యత్వాలు కలిగి ఉన్న యూనియన్‌గా పీఆర్టీయూ రాష్ట్రంలోనే గుర్తింపు పొందింది. ఈ జిల్లా నుంచి రాష్ట్ర ఆర్గనైజింగ్ ప్రసిడెంట్లు, కార్యదర్శులుగా రాష్ట్ర కమిటీలో పది మందికి పైగా ఉన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవిని ఎలాగైనా సాధించాలన్న పట్టుదలతో సంఘం జిల్లా నేతలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ప్రధాన కార్యదర్శి పదవి రేసులో ఉన్న దామోదర్‌రెడ్డి సైతం ఆయా జిల్లాల్లో పర్యటించి వారి మద్దతు కూడగడుతున్నారు. పీఆర్టీయూ రాష్ట్ర నేతలు, శాసన మండలి సభ్యుల మద్దతుకోసం ప్రయత్నించారు. నెల రోజులుగా పీఆర్టీయూ నేతలు వివిధ జిల్లాల్లో తిరుగుతూ దామోదర్‌రెడ్డికి మద్దతు ఇవ్వాలని ఆయా జిల్లాలకు చెందిన నేతలను కోరుతున్నారు. చాలా జిల్లాల్లో సానుకూలత లభించిందని పీఆర్టీయూ జిల్లా నేతలు చెబుతున్నారు.

దసరా కానుకగా పేదలకు 'డబుల్' ఇళ్లు

- ప్రభుత్వ స్థలాలు కబ్జా కాకుండా చర్యలు తీసుకోవాలి
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, చిత్రంలో మంత్రులు కొండా సురేఖ, కోమటిరెడ్డి

నిజామాబాద్ అర్బన్ : నిజామాబాద్ జిల్లాలో పూర్తయిన డబుల్ బెడ్ రూం ఇళ్లను దసరా కానుకగా అర్హులైన పేదలకు అందించాలని రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. జిల్లాలో అమలవుతున్న ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ పథకాల తీరుపై ఆయన రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అటవీ, దేవాదాయ శాఖల మంత్రి కొండా సురేఖతో కలిసి శుక్రవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డబుల్ బెడ్ రూం ఇళ్లను కేటాయించేందుకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి పర్యవేక్షణలో లబ్ధిదారులుగా ఎంపిక చేయాలన్నారు. లబ్ధిదారుల ఎంపికకు త్వరలోనే ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేయనుందన్నారు. ఆస్పత్రుల్లో వైద్యుల పోస్టులను రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా భర్తీ చేసేందుకు ప్రభుత్వం ఆలోచిస్తోందని, ఆలోపు కాంట్రాక్టు పద్ధతిన నియమించుకుని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురి కాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జనవరి నుంచి రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తామన్నారు. రేషన్, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్, రూ.500కు గ్యాస్, రాజీవ్ ఆరోగ్య శ్రీ వంటి అన్ని పథకాలకు భవిష్యత్‌లో ఫ్యామిలీ డిజిటల్ కార్డు ప్రామాణికంగా నిలుస్తుందని తెలిపారు. సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు వేంనరేందర్ రెడ్డి, షబ్బీర్ అలీ, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, ఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్ పాల్గొన్నారు.

రైతు సమస్యలపై బీకేఎస్ పోరు


కామారెడ్డిలో బహిరంగ సభ వేదిక వద్ద ఏర్పాట్లు


మాట్లాడుతున్న బీకేఎస్ నాయకులు

బలోపేతమే లక్ష్యంగా అడుగులు
- పంట రుణాల మాఫీ కోసం ఆందోళనలు
- గ్రామస్థాయిలో కమిటీల ఏర్పాటు
- నేడు కామారెడ్డిలో రాష్ట్ర మహాసభలు, బహిరంగ సభ

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : రైతులను సంఘటితం చేయడానికి భారతీయ కిసాన్ సంఘ్ అడుగులు వేస్తోంది. గ్రామస్థాయి వరకు కమిటీలను ఏర్పాటు చేస్తూనే.. రైతు సమస్యలపై పోరాడుతోంది. ఇప్పటికే పంట రుణాల మాఫీ కోసం పలుచోట్ల ఆందోళనలు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఏకకాలంలో రూ. 2 లక్షల రుణమాఫీ చేయాలన్న డిమాండ్‌తో పలుచోట్ల నిరసన కార్యక్రమాలు నిర్వహించింది. పార్టీలు వేరైనా రైతులంతా ఒక్కటే అనే నినాదంతో సంఘం నేతలు జిల్లా అంతటా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రైతులను సంఘటితం చేస్తూనే భారతీయ కిసాన్ సంఘ్ గ్రామ కమిటీలు, మండల కమిటీలు, జిల్లా కమిటీలను ఎన్నుకున్నారు. ఇప్పుడు రాష్ట్ర మహాసభలను కూడా కామారెడ్డిలో నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ గ్రౌండ్స్‌లో మహాసభల అనంతరం బహిరంగ సభ నిర్వహించనున్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి వేలాది మంది రైతులను సమీకరించేందుకు భారతీయ కిసాన్ సంఘ్ నేతలు ఏర్పాట్లు చేశారు. మహాసభల సందర్భంగా రైతుల సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలపై మాట్లాడి వాటి పరిష్కారం కోసం చేపట్టనున్న నిరసన కార్యక్రమాలపై కార్యాచరణ ప్రకటించనున్నారు. 20 వేల మందితో సభ నిర్వహిస్తామని భారతీయ కిసాన్ సంఘ్ నేతలు పేర్కొంటున్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి వచ్చే రైతులకు కావలసిన సౌకర్యాలు ఏర్పాటు చేశారు. కామారెడ్డి జిల్లాలో ఊరూరా కమిటీలు ఏర్పాటు చేసిన నేపథ్యంలో ప్రతి గ్రామం నుంచి భారీ సంఖ్యలో రైతులు వస్తారని భావిస్తున్నారు.

వరంగల్ డిక్లరేషన్ అమలు కోసం..

రైతులకు ఎలాంటి షరతులు లేకుండా రూ.2 లక్షల లోపు పంట రుణాలను మాఫీ చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ డిమాండ్ చేస్తోంది. ఈ డిమాండ్‌తో ఇప్పటికే జిల్లా కేంద్రంలో ర్యాలీ, ధర్నా నిర్వహించింది. అలాగే జిల్లాలోని వివిధ మండలాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టింది. కాంగ్రెస్ వరంగల్ డిక్లరేషన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేసింది. రైతు భరోసా కింద రైతులు, కౌలు రైతులకు రూ.15 వేలు, రైతు కూలీలకు ఏడాదికి రూ.12 వేలు ఇవ్వాలని ఆ సంఘం నేతలు డిమాండ్ చేస్తున్నారు. అన్ని పంటలకు క్వింటాలుకు రూ.5 వందల బోనస్ ఇవ్వాలని కోరుతున్నారు. మూతబడిన చక్కెర కర్మాగారాలను తెరిపించాలని, పంటల బీమా పథకం అమలు చేయాలని, భూమి లేని కౌలు రైతులు, కూలీలకు కూడా రైతు బీమా వర్తింపజేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని, అసైన్డ్ భూముల లబ్ధిదారులకు యాజమాన్య హక్కులు కల్పించాలని, ధరణి ద్వారా ఏర్పడిన సమస్యలను పరిష్కరించి, గతంలో ఉన్న భూ హక్కులను పునరుద్ధరించాలని కిసాన్ సంఘ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తోంది. నకిలీ విత్తనాలు, పురుగు మందుల వ్యాపారులపై పీడీ చట్టం పెట్టి రైతులకు నష్టపరిహారం ఇప్పించాలని, అసంపూర్తిగా ఉన్న నీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని, వన్యప్రాణులతో నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలన్న డిమాండ్లపై మహాసభలో తీర్మానాలు చేయనున్నట్లు ఆ సంఘం ప్రతినిధులు తెలిపారు.

సభకు రాష్ట్ర, జాతీయ నేతలు..

భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర మహాసభలకు జిల్లాకు చెందిన బీకేఎస్ నేతలు కొమిరెడ్డి అంజన్న, విఠల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శంకర్‌రావు తదితరుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి మోహిన్ మోహన మిశ్రా, కార్యదర్శి కొండెల సాయిరెడ్డి, ఊర్జ ప్రముఖ్ మోదిగంటి శ్రీధర్‌రెడ్డి, క్షేత్ర సంఘటన మంత్రి దోనూరి రాము, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జోగినిపల్లి శ్రీరంగారావు, ప్రతినిధులు నగేశ్, వెంకటరెడ్డి, లావణ్యరెడ్డి, రాజిరెడ్డి ఆనందరావు, మల్లారెడ్డి, మాణిక్యరెడ్డి తదితరులు హాజరవుతారని వారు పేర్కొన్నారు. మధ్యాహ్నం రెండు గంటల వరకు రాష్ట్ర కార్యవర్గ సమావేశం ముగించి, అనంతరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో బహిరంగ సభ నిర్వహించనున్నట్టు తెలిపారు. మహాసభలను పార్టీలకతీతంగా రైతులు విజయవంతం చేయాలని కోరారు.

ఎలక్ట్రిక్ బస్సులతో పర్యావరణానికి మేలు

- రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్


బస్సులో కూర్చున్న మంత్రి పొన్నం, ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి, భూపతిరెడ్డి, ధన్‌పాల్

ఖలీల్‌వాడి : ఎలక్ట్రిక్ బస్సులతో పర్యావరణానికి మేలు జరుగుతుందని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. నిజామాబాద్ బస్టాండ్‌లో 13 ఎలక్ట్రికల్ బస్సులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్టీసీని బీఆర్ఎస్ హయాంలో నిర్లక్ష్యం చేశారన్నారు. నష్టాల్లో ఉన్న ఆర్టీసీ ఇప్పుడు గట్టెక్కుతోందన్నారు. జిల్లాకు 64 ఎలక్ట్రిక్ బస్సులను కేటాయించగా మొదటి విడతలో 13 బస్సులు వచ్చాయన్నారు. వీటిని నిజామాబాద్ నుంచి జేబీఎస్ వరకు నడపనున్నట్లు తెలిపారు. మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించిన నాటి నుంచి మహిళలు రూ.3,500 కోట్ల విలువైన ఉచిత ప్రయాణం చేశారన్నారు. కార్యక్రమంలో ఆర్ఎం జానీరెడ్డి, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ, భూపతిరెడ్డి, మేయర్ నీతూకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శంగా నిలుస్తున్న యువమిత్రులు

- ఉన్న ఊరిలోనే ఉపాధి వెతుక్కున్న యువకులు
- గేదెలను కొనుగోలు చేసి వ్యాపారం
- యువతకు ఆదర్శంగా నిలుస్తున్న వైనం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): ఎవరో వస్తారని...ఏదో చేస్తారని చూడకుండా తమ కాళ్లపై తాము నిలబడి తమకు వచ్చిన సొంత ఆలోచనతో ఉన్న ఊరిలోనే ఉపాధి పొందుతున్నారు. నేటి తరంలో ఎందరో యువకులు బతుకుదెరువు నిమిత్తం విదేశాలకు వెళ్లి, అప్పుల ఊబిలో కూరుకుపోతున్న నేటి యువతరానికి ఆదర్శంగా నిలుస్తున్నారు ఆ ఇద్దరు యువ మిత్రులు.

బాల్యం నుంచి ఇద్దరు కలిసి ఒకే పాఠశాలలో చదువుకుంటు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కూడా ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. ఈ క్రమంలో వారి కుటుంబ పెద్దలు అయిన ఇద్దరి తండ్రులు వివిధ కారణలతో మరణించారు. కుటుంబ పెద్ద మరణించడంతో కుటుంబ భారం మోయాల్సి రావడంతో ఇద్దరు పాల వ్యాపారం చేద్దామని నిర్ణయానికి వచ్చారు. అనుకొన్న తరుణంలోనే మొదటగా రెండు గేదెలను కొనుగోలు చేసి, వాటిని మేపుతూ.. ఉదయం సాయంత్రం వేళ ల్లో పాలు పితుకుతూ..ఉపాధి పొందుతున్నారు.. సదాశివనగర్ మండల కేంద్రానికి చెందిన నిమ్మలబోయిన అశోక్, కొడగంటి నిఖిల్‌లు. వీరు నేటి యువతరానికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రస్తుతం 11 గేదెలు కొనుగోలు చేసి ప్రతి రోజు వాటిని మేపుతూ, ఉదయం సాయంత్రం వేళల్లో పాలను పితుకుతున్నారు. ప్రతి రోజు 40 లీటర్ల వరకు పాలను హోటల్‌లో విక్రయిస్తు ఆదాయం పొందుతున్నారు. పాల ద్వారా వచ్చిన ఆదాయాన్ని ఖర్చులు పోను ఇద్దరు పంచుకుని జీవనాన్ని సాగిస్తున్నారు.


ఇద్దరు మిత్రులు కలిసి ఏర్పాటు చేసుకున్న షెడ్

ఆలనాపాలనా చూస్తూ..

అశోక్‌కు వ్యవసాయ బావి వద్ద ఉన్న స్థలంలో ఒక ప్రత్యేక షెడ్డును ఇద్దరు కలిసి నిర్మించారు. ఆ షెడ్డులో గేదెలు పెంచి పోషిస్తున్నారు. షెడ్డు నిర్మాణం కోసం వేలల్లో ఖర్చు చేసే స్తోమత తమ వద్ద లేకపోవడంతో ఇద్దరు కలిసి షెడ్డును నిర్మించుకున్నారు. రాత్రింబవళ్లు పశువుల ఆలనాపాలనా చూస్తు ఉపాధి పొందుతున్నారు. వచ్చిన కొంత లాభమైన దానితోనే సంతృప్తి పొందుదామని వారు నిర్ణయానికి వచ్చారు.

సొంత పనే ఆనందాన్నిస్తుంది



సొంతంగా చేసుకునే పనే ఆనందాన్నిస్తుంది. ఒకరి వద్ద పని చేస్తే వారికి బానిసలాగా ఉండాల్సి వస్తది. సొంత కాళ్ల మీద నిలబడి పని చేసుకోవడమే బెటర్. ఉన్న ఊరిలోనే సంపాదన బాగుంటుంది. విదేశాలకు వెళ్లి అప్పుల పాలు కావల్సిన దానికంటే పాడి ద్వారా మంచి ఉపాధి పొందుతున్నాం. మూగజీవాలకు సేవ చేయడం మంచి సంతృప్తినిస్తుంది. వాటి ద్వారా ఆదాయం లభిస్తోంది.

– నిమ్మల బోయిన అశోక్, సదాశివనగర్

ప్రభుత్వం సహకరించాలి..



మా లాంటి యువకులకు ఉపాధి చూపిస్తు ప్రభుత్వం ఆర్థిక సహకారం అందిస్తే బాగుంటది. ప్రభుత్వం ప్రోత్సాహం అందించాలి. చిన్న తనంలో మా తండ్రి మరణించడంతో కుటుంబ భారం మోయాల్సి వచ్చింది. ఏదో ఒక ఉపాధి పొందాలనే ఉద్దేశ్యంతో పాల వ్యాపారంను ఎంచుకున్నా. ప్రతి రోజు పాలను హోటల్‌లో విక్రయిస్తూ ఆదాయం పొందడం ఆనందంగా ఉంది.

– కొడగంటి నిఖిల్, సదాశివనగర్

క్లుప్తంగా

నీళ్లు పట్టుకునే దారేదీ..?



రాజంపేట : రాజంపేట మండల కేంద్రంలోని గాంధీ కాలనీలో ఇటీవల గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో సింటెక్స్ మినీ వాటర్ ట్యాంకు నిర్మించారు. వాటర్ ట్యాంకు పట్టుకునే నల్లాను డ్రైనేజీపైన ఏర్పాటు చేయడంతో నీటిని పట్టుకోవడానికి ఇబ్బందిగా ఉందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. నీరు పట్టుకునే క్రమంలో డ్రైనేజీలో పడే ప్రమాదం ఉందని వాపోతున్నారు. అధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు. ఈ విషయం పంచాయతీ కార్యదర్శి అశోక్‌ను 'సాక్షి' వివరణ కోరగా నీరు వృథా కాకుండా పైపును అలా నిర్మించామని డ్రైనేజీపై ఇనుప జాలీ ఏర్పాటు చేసి ఇబ్బంది కలగకుండా చూస్తామని తెలిపారు.

ఈవీఎం గోదాం పరిశీలన



కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదాంను కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ శుక్రవారం సందర్శించారు. ఈవీఎంలు, వీవీ ప్యాట్ యంత్రాలు, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు మదన్‌లాల్, సంతోష్‌రెడ్డి, ఖాసీం అలీ, ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు సరళ బాయి, డీటీలు అనిల్, ఇందిరా ప్రియదర్శిని తదితరులున్నారు.

7న మండల పరిషత్‌లో ప్రజావేదిక

కామారెడ్డి రూరల్ : మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 7వ తేదీన సామాజిక తనిఖీ ప్రజా వేదిక ఉంటుందని ఎంపీడీవో నాగవర్ధన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల్లో జరిగిన సామాజిక తనిఖీ పనులను ఈనెల 3వ తేదీ నుంచి 6వ తేదీ వరకు ప్రతి గ్రామంలో ఆడిట్ చేసినట్లు ఆయన వివరించారు. ఆడిట్ వివరాలను 7న తేదీన మండల పరిషత్ కార్యాలయంలో మధ్యాహ్నం జరిగే సామాజిక తనిఖీ 15వ ప్రజావేదికలో చదివి వినిపిస్తామన్నారు.

ముదిరాజ్‌ల అభ్యున్నతికి పాటుపడాలి

బీబీపేట : ముదిరాజ్‌ల అభ్యున్నతికి ప్రతి ముదిరాజ్ సభ్యుడు కృషి చేయాల్సిన అవసరం ఉందని కొరివి కృష్ణ స్వామి ముదిరాజ్ సేవా సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోడేటి సత్యం అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పెద్దమ్మ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ముదిరాజ్‌లకు మత్స్యకార సంఘంలో సభ్యత్వం కల్పించాలని అన్నారు. ముదిరాజ్‌లను బీసీ 'డీ' నుండి బీసీ 'ఏ' లోకి మార్చాలని డిమాండ్ చేశారు. ముదిరాజ్‌ల డిమాండ్ల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కొరివి కృష్ణ స్వామి ముదిరాజ్ సేవా సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆగం పాండన్న, శ్రీనివాస్, సదర్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న ముదిరాజ్ సభ్యులు

మెడికల్ విద్యార్థులకు ఆర్థికసాయం



కామారెడ్డి టౌన్ : ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్(ఐఏపీ) ఆధ్వర్యంలో కామారెడ్డి మెడికల్ కళాశాలలో చదువుతున్న ఆరుగురు పేద మెడికల్ విద్యార్థులకు శుక్రవారం ఒకొక్కరికి రూ. 10వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. ఈ మేరకు విద్యార్థులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా సీనియర్ వైద్యులు మాట్లాడుతూ పేదరికానికి ఉన్నత చదువులు అడ్డంకి కాదన్నారు. వైద్యులు వెంకట్రాజం, నరేందర్‌రావు, వెంకటేశ్వర్‌గౌడ్, మల్లికార్జున్, శ్రీనివాస్ తదితరులున్నారు.

నేలకొరిగిన వరిపంట

నిజాంసాగర్(జుక్కల్): ఆరుగాలం కష్టపడి పండించిన పంట నేలవాలడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గురువారం సాయంత్రం మండలంలోని ఒడ్డేపల్లి, జక్కాపూర్, మల్లూర్, మల్లూర్ తాండ గ్రామ పంచాయతీల్లో రెండు గంటల పాటు ఏకధాటిగా వర్షం కురిసింది. 15రోజుల్లో కోతకు రావాల్సిన వరిపంట పూర్తిగా నేలకొరిగిది. పంట పొలాలు నేలకొరగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.


మల్లూర్‌లో వరి పంట

అర్హులకు దసరాకు డబుల్ ఇళ్లు

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : అర్హులందరికీ దసరాకు డబుల్ ఇళ్లు అందజేస్తామని, పార్టీలో పని చేసిన వారికే పదవులు దక్కుతాయని ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు పేర్కొన్నారు. శుక్రవారం మర్కల్ స్టేజీ వద్ద అశోక్ గార్డెన్స్‌లో సదాశివనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటి పాలకవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంతకు ముందు మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో ప్రత్యేక పూజలు చేసి, చైర్మన్ సంగ్యానాయక్‌కు బాధ్యతలు స్వీకరణ కార్యక్రమం చేపట్టారు. అనంతరం చైర్మన్, వైస్ చైర్మన్‌లను సన్మానించారు. అశోక్ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దసరాకు నిరుపేదలకు డబుల్ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. త్వరలో నూతన గ్రామ, మండల కమిటిలను ఏర్పాటు చేస్తామన్నారు. పార్టీ కార్యకర్తలు గ్రామాల్లో సైనికుల్లా పని చేసి పార్టీ ప్రతిష్ఠకు కృషి చేయాలన్నారు. అనంతరం మర్కల్ స్టేజీ వద్ద పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌కు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ కార్యదర్శి గంగు, ఏఎంసీ వైస్ చైర్మన్ రాజిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు సంగారెడ్డి, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు బొంబోతుల లింగాగౌడ్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సంపత్ గౌడ్, మాజీ వైస్ ఎంపీపీలు గాదారి శ్రీనివాస్ రెడ్డి, రూపెందర్ రెడ్డి, మాజీ మండల కో–ఆప్షన్ ఇర్షాదొద్దిన్, విండో చైర్మన్లు తదితరులున్నారు.


కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు

దత్తాత్రేయ ఆలయంలో చండీహోమం



కామారెడ్డి టౌన్ : జిల్లా కేంద్రంలోని దత్తాత్రేయ ఆలయంలో దేవి శరన్నవరాత్రులు సందర్భంగా శుక్రవారం చండీ పారాయణం, మహా చండీ హోమం వైభవంగా నిర్వహించార. వైద బ్రాహ్మణ పండితుల బృందంతో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మారుతి, శ్రీదేవి, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంట పరిశీలన



బాన్సువాడ రూరల్ : మండలంలోని కాద్లాపూర్ గ్రామంలో శుక్రవారం మండల వ్యవసాయాధికారి నదీమ్ ఉద్దీన్ మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ప్రస్తుతం మొక్కజొన్న పంటనూర్పిళ్లు ప్రారంభమయ్యాయన్నారు. పంటకోత సమయంలో తీసకోవాల్సిన జాగ్రత్తలు, మార్కెటింగ్ గురించి రైతులతో చర్చించారు. తక్కువ ధరకు దళారుకుల పంట ఉత్పత్తులు విక్రయించరాదని ప్రభుత్వమే మద్దతుధర ప్రకారం కొనుగోలు చేస్తుందన్నారు. ఆయన వెంట ఏఈవో జ్ఞానేశ్వర్ ఉన్నారు.

కొనసాగుతున్న ఇంటింటి సర్వే



బాన్సువాడ రూరల్ : ప్రతి కుటుంబానికి ప్రత్యేక డిజిటల్ కార్డు అందించాలనే ఉద్దేశంతో చేపట్టిన ఇంటింట సర్వే బాన్సువాడ మండలం నాగారం గ్రామంలో కొనసాగుతోంది. అధికారులు ఇంటింటికి వెళ్ళి కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేసి ఫొటోలు సేకరిస్తున్నారు. సర్వేను ఎంపీడీవో బషీరుద్దీన్, ఎంపీవో సత్యనారాయణరెడ్డి తో కలిసి పరిశీలించారు. జీపీ కార్యదర్శులు సృజన్‌రెడ్డి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా రాజ్‌మోహన్ రెడ్డి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : నాగిరెడ్డిపేట మండలంలోని ఆత్మకూర్ గ్రామానికి చెందిన ఉమ్మన్నగారి రాజ్‌మోహన్ రెడ్డి బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఎంపికై నట్లు బీజేపీ మండలాధ్యక్షుడు శ్రీకాంత్ తెలిపారు. లింగంపేటలో శుక్రవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార ఆత్మకూర్‌కు చెందిన రాజ్మోహన్ రెడ్డిని జిల్లా కార్యవర్గ సభ్యులుగా నియమించారని ఆయన చెప్పారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

బాన్సువాడ రూరల్ : మండలంలోని బోర్లంక్యాంపుతండా జీపీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం పద్మపాణి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పశుపోషణ, యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయానికి అనుబంధంగా పశుపోషణను కొనసాగించి, ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. పశువులకు వచ్చే గాలికుంటు, గర్భకోశ వ్యాధుల నివారణకు ఎప్పటికప్పుడు నివారణ టీకాలు ఇప్పించాలన్నారు. పాలదిగుబడి పెరగడానికి నాణ్యమైన గ్రాసం ఎంతో ముఖ్యం కాబట్టి, దీనికోసం లూజర్న్, అజోల్ల, సూపర్నెయర్ మిక్సర్‌లను పశువులకు అందించాలన్నారు. సంస్థ ప్రతినిధులు భూపతి, రైతులు సంజీవ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాంచందర్, దత్తురాం, పవన్, వినయ్, జీపీ కార్యదర్శి పరిపూర్ణ, అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

బాన్సువాడ రూరల్ : ప్రతి శుక్రవారం తమ ఇళ్లలోని పాత్రలు, వాటర్‌ట్యాంకులు, కుండీల్లో నిల్వనీటిని పారబోసి శుభ్రపర్చాలని ఎంపీడీవో బషీరుద్దీన్ అన్నారు. ఫ్రైడే డ్రైడేలో భాగంగా కొల్లూర్, నాగారం గ్రామాల్లో పర్యటించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యదర్శులు నవీన్, సృజన్‌రెడ్డి, ఎంపీవో సత్యనారాయణరెడ్డి, అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

మంచినీటి సహాయకులకు శిక్షణ

లింగంపేట(ఎల్లారెడ్డి) : గ్రామ మంచినీటి సహాయకులకు నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం డీఎల్‌పీవో సురేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. 4 రోజుల పాటు జీపీ సిబ్బందికి శిక్షణ ఇస్తామన్నారు. ఎంపీడీవో నరేశ్, ఎంపీవో మలహరి, ఆర్‌డబ్ల్యూస్ డీఈ తదితరులున్నారు.

ప్రభుత్వ సలహాదారును కలిసిన 'రైస్ మిల్లర్స్'



కామారెడ్డి క్రైం : జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ప్రతినిధులు శుక్రవారం జిల్లాకేంద్రంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీని కలిశారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్, సెక్రెటరీ సంతోష్, కోశాధికారి సుదర్శన్, వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మణ్, మిల్లర్స్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

తప్పిపోయిన బాలుడి అప్పగింత



రుద్రూర్: జార్ఖండ్ రాష్ట్రం నుంచి తప్పిపోయి వచ్చిన పదకొండేళ్ల బాలుడు వీరకుమార్‌ను శుక్రవారం బాలల సంరక్షణ సమితి అధికారులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల జార్ఖండ్‌లో వరదల కారణంగా బాలుడు తప్పిపోయి ట్రెయిన్‌లో బోధన్‌కు చేరుకున్నాడు. బోధన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు బాలుడిని పీఎస్‌కు తీసుకెళ్లిన అనంతరం సంరక్షణ నిమిత్తం కోటగిరి మండలం ఎకాస్‌పూర్ క్యాంపు గుమ్మడి ఫౌండేషన్ అనాథ ఆశ్రమంలో చేర్పించారు. ఆశ్రమ నిర్వాహకులు బాలుడికి బట్టలు, భోజనం అవసరమగు వసతి కల్పించారు. తెలుగు భాష రానందున బాలుడితో హిందీలో మాట్లాడుతూ.. బాలుడి తల్లితండ్రుల వివరాలు తెలుసుకుని బాలల సంరక్షణ అధికారులకు తెలియజేశారు. బాలుడు ఇచ్చిన సమాచారం మేరకు జార్ఖండ్‌లోని తల్లిదండ్రులను పిలిపించి ఆశ్రమ నిర్వాహకుల సమక్షంలో కుటుంబ సభ్యులకు బాలుడిని అప్పగించారు. కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ చైర్‌పర్సన్ సంపూర్ణ, అధికారి చైతన్య కుమార్, ఫౌండేషన్ సభ్యులు ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య

పిట్లం: ఆర్థిక ఇబ్బందులో ఒకరు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన పిట్లం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించి పోలీసులు శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన విఠల్(37) కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. దీంతో తాగుడుకు బానిసై గ్రామ శివారులోని మారేడు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య గంగామణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

పోలీసుల అదుపులో వసూళ్లకు పాల్పడుతున్న ముఠా

- స్వచ్ఛంద సేవా సంస్థల పేరుతో వసూళ్లు



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ ప్రాంతంలో ప్రఖ్యాత స్వచ్ఛంద సంస్థ పేరుతో వసూళ్లకు పాల్పడుతున్న ముఠాను ఆర్మూర్ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. గత పదిరోజులుగా ఆర్మూర్ కేంద్రంగా అడ్డా ఏర్పాటు చేసుకొని ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజక వర్గాల్లోని పలు గ్రామాల్లో ఈ ముఠా వసూళ్లకు పాల్పడినట్లు సమాచారం. పదిమంది ముఠాగా ఏర్పడి ఇద్దరు చొప్పున గ్రామాల్లో తిరుగుతూ.. ప్రతిరోజు కొంత డబ్బులను వసూలు చేశారు. బోధన్ నియోజకవర్గం నవీపేట మండలం నాళేశ్వరంలో తపస్వీ స్వచ్ఛంద సేవా సంస్థ పేరుతో తిరుగుతూ వసూళ్లకు పాల్పడ్డారు. కాగా నాళేశ్వరానికి చెందిన మాజీ ప్రజాప్రతినిధితో పాటు గ్రామస్తులకు ఆర్మూర్‌కు చెందిన తపస్వీ స్వచ్ఛంద సంస్థతో సేవా కార్యక్రామల్లో పాలుపంచుకున్న పరిచయం ఉండటంతో ఆరాతీశారు. ముఠాను పట్టుకోవాలని ప్రణాళిక రచించారు. ఫౌండేషన్‌కు పుట్టిన రోజు సందర్భంగా సహాయం చేస్తామని ముఠాకు చెందిన ఇద్దరిని పిలిపించి ఆర్మూర్‌లోని తపస్వీ సంస్థకు తీసుకెళ్లారు. కాగా వీరు సంస్థకు చెందిన వారు కాదని తేలింది. వీరు మెడ్చల్ కేంద్రంగా విజన్ ఇండియా ఫౌండేషన్ పేరుతో ఐడీ కార్డులు ధరించి డబ్బులు వసూళ్లకు పాల్పడుతున్నారు. దీంతో 10 మంది ముఠాను సభ్యులను కౌన్సిలర్ లిక్కిశంకర్ సహాయంతో సంస్థ సభ్యులు పోలీసులకు అప్పగించారు. పోలీసులు ముఠా సభ్యులను విచారిస్తున్నారు.

వేర్వేరు ఘటనల్లో నలుగురి మృతి

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో శుక్రవారం చోటు చేసుకున్న వేర్వేరు ఘటనల్లో నలుగురు మృతి చెందారు. ఒకరు కుంటలో పడి మృతి చెందగా మరో ఇద్దరు రోడ్డు ప్రమాదాల్లో, ఓ యువకుడు గుండెపోటుతో మృతి చెందాడు.


చింటు (ఫైల్)

ఎల్లారెడ్డి: ప్రమాదవశాత్తు కుంటలో పడిన యువకుడు మృతి చెందిన ఘటన ఎల్లారెడ్డి మండలంలోని కొక్కొండ గ్రామంలో చోటు చేసుకున్నట్లు ఎస్సై మహేశ్ శుక్రవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కమ్మరి చింటు(19) అనే యువకుడు గురువారం ఇంటి నుంచి బహిర్భూమికి వెళ్లి వస్తానని చెప్పి తిరిగి రాలేదు. కుటుంబీకులు పలు చోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. చింటు తండ్రి యాదగిరి శుక్రవారం గ్రామ శివారులో వెతుకుతుండగా మేకలవారి కుంటలో మృతదేహం కనిపించింది. దీంతో ఒడ్డుకు తీసుకు రాగా అప్పటికే మృతి చెందాడు. ప్రమాదవశాత్తు కాలు జారి కుంటలో జారి పడి మృతి చెందాడని మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..

మాచారెడ్డి: రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందిన ఘటన మాచారెడ్డి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై అనిల్ శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కాకులగుట్ట తండాకు చెందిన బానోత్ హనుమ(58) పని నిమిత్తం బైక్‌పై గురువారం రాత్రి మాచారెడ్డికి వస్తుండగా మండల కేంద్రంలోని చౌరస్తా ప్రాంతంలో ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొన్నది. ఈ ఘటనలో హనుమాకు తీవ్రగాయాలు కాగా స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.


హనుమ (ఫైల్)

కమ్మర్‌పల్లిలో మరొకరు..

కమ్మర్‌పల్లి: రోడ్డు ప్రమాదంలో ఓ బీజేపీ నేత మృతి చెందిన ఘటన కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన బీజేపీ నేత చింత గణేశ్(49) శుక్రవారం మధ్యాహ్నం తన బైక్‌పై తన అత్తమ్మను ఉప్లూర్‌లో దింపి తిరిగి వస్తుండగా దమ్మన్నపేట శివారులోని వ్యవసాయ పొలం నుంచి అకస్మాతుగా హార్వెస్టర్ రోడ్డుపైకి రావడంతో గణేశ్‌ను ఢీకొన్నది. ఈ ఘటనలో గణేశ్ తలకు బలమైన గాయం కావడంతో స్థానికులు మెట్‌పల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. గణేశ్ నాలుగున్నరేళ్ల పాటు బీఆర్ఎస్ కమ్మర్‌పల్లి గ్రామశాఖ అధ్యక్షుడిగా పని చేశారు. కొన్ని అనివార్య కారణాలతో బీఆర్ఎస్‌ను వీడి బీజేపీలో చేరారు. గణేశ్ మృతిపై పలువురు నాయకులు సంతాపం తెలిపారు.


చింత గణేశ్(ఫైల్)

గుండె పోటుతో యువకుడు..

లింగంపేట: మండలంలోని నల్లమడుగు గ్రామానికి చెందిన మెట్టు శేఖర్(28) శుక్రవారం గుండె పోటుతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. శేఖర్‌కు శుక్రవారం తెల్లవారు జామున ఛాతిలో నొప్పి రావడంతో కుటుంబీకులు లింగంపేటలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కామారెడ్డికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. గ్రామంలో ఎంతో కలుపుగోలుగు ఉండేవాడని గ్రామస్తులు తెలిపారు. శేఖర్ మృతితో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.


శేఖర్(ఫైల్)

వరకట్నం వేధింపుల కేసులో.. భర్త, అత్తలకు ఏడేళ్ల జైలు

కామారెడ్డి క్రైం: వరకట్నం కోసం ఓ ఇల్లాలిని వేధింపులకు గురిచేసి ఆమె మృతికి కారణమైన భర్త, అత్తమ్మలకు ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ కామారెడ్డి కోర్టు శుక్రవారం తీర్పు వెల్లడించింది. వివరాలిలా ఉన్నాయి. దోమకొండ మండలం సంగమేశ్వర్ గ్రామానికి చెందిన లావణ్య(24) భిక్కనూరు మండలం రామేశ్వర్‌పల్లి గ్రామానికి చెందిన మల్లాని గణేశ్ ప్రేమించుకున్నారు. వీరి ప్రేమను అంగీకరించిన లావణ్య అన్న రామస్వామి ఐదేళ్ల క్రితం పెద్దల సమక్షంలో వివాహం జరిపించాడు. కొద్ది రోజులు బాగానే ఉన్నా భర్త గణేశ్, అత్త ఎల్లవ్వ వరకట్నం తీసుకురావాలని వేధింపులకు గురి చేశారు. శారీరకంగా, మానసికంగా వేధింపులు పెరగడంతో లావణ్య ఇంట్లోనే ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి అన్న రామస్వామి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను కోర్టులో హాజరుపర్చారు. నాటి నుంచి కేసు విచారణలో ఉంది. సాక్షాధారాలను పరిశీలించిన జిల్లా న్యాయమూర్తి సీహెచ్ వీవీఆర్ వరప్రసాద్ నిందితులకు ఏడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. పోలీసుల తరపున వాదనలు వినిపించిన పీపీ రాజగోపాల్ గౌడ్, కేసును సరైన పద్ధతిలో విచారణ చేపట్టిన అప్పటి డీఎస్పీ ప్రసన్నరాణి, సీఐ కోటేశ్వరరావు, ఎస్సై రాజు, ప్రస్తుత డీఎస్పీ నాగేశ్వరరావు, సీఐ సంపత్ కుమార్, ఎస్సై సాయికుమార్, కోర్టు లైజనింగ్ అధికారి మురళి, సిబ్బంది ప్రమోద్ కుమార్‌లను ఎస్పీ సింధు శర్మ అభినందించారు.

ఒకరి అదృశ్యం

పిట్లం: మండలంలోని పారేడ్‌పల్లి గ్రామానికి చెందిన కత్తిగామ సాయిలు అనే వ్యక్తి అదృశ్యమైనట్లు పోలీసులు శుక్రవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సాయిలు సెప్టెంబర్ 29న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. సాయిలు భార్య చంద్రవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రాజీవ్‌నగర్‌లో..

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్ కాలనీలో నివాసం ఉండే ఏలేటి అచ్యుత్ కుమార్ అనే వ్యక్తి అదృశ్యమైనట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి శుక్రవారం తెలిపారు. కూలీ పని చేసుకుంటూ జీవించే అతను ఈ నెల 3న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతని భార్య లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

నకిలీ పాస్‌పోర్ట్ కేసులో ఇద్దరి అరెస్ట్

కామారెడ్డి క్రైం: నకిలీ పాస్‌పోర్ట్ కేసులో రామారెడ్డి మండలం రెడ్డిపేటకు చెందిన ఇద్దరిని ఢిల్లీ పోలీసులు అరెస్ట్ చేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలిలా ఉన్నాయి. రెడ్డిపేటకు చెందిన వాహబ్ మహమ్మద్ తన పేరును హసన్ అబ్దుల్‌గా మార్చుకుని తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించాడు. వాటితో పాస్‌పోర్ట్ పొంది కొన్ని రోజుల క్రితం కువైట్ వెళ్లాడు. అక్కడి ఇమిగ్రేషన్ అధికారులు నకిలీ పాస్‌పోర్టుగా గుర్తించి విమానంలో అతడిని తిరిగి ఢిల్లీకి పంపించారు. ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో దిగగానే వాహబ్ మహమ్మద్‌ను ఇక్కడి ఇమిగ్రేషన్ అధికారులు అరెస్ట్ చేసి పీఎస్‌కు తరలించారు. తప్పుడు ధ్రువపత్రాలతో పాస్‌పోర్ట్ తయారు చేయడంలో రెడ్డిపేటకు చెందిన మరో ఇద్దరు వ్యక్తులు మహమ్మద్‌కు సహకరించినట్లుగా ఢిల్లీ పోలీసుల విచారణలో తేలింది. వారిని కూడా అరెస్ట్ చేయడానికి రెండు రోజుల క్రితం ఢిల్లీ నుంచి పోలీసులు రెడ్డిపేటకు వచ్చారు. ఈ కేసులో రెడ్డిపేటకు చెందిన శంకర్ నాయక్‌ను అరెస్ట్ చేయగా మరో జిరాక్స్ సెంటర్ యజమాని పరారీలో ఉన్నట్లు తెలిసింది.